కుంభమేళా సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు కుటుంబసమేతంగా ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లారు. అక్కడి త్రివేణి సంగమంలో గురువారం పుణ్యస్నానాలు చేశారు.

కేంద్రం 'డబుల్' బాదుడు

- సెస్, సర్‌చార్జీల పెంపుతో ప్రజలపై అదనపు భారం
- 10 ఏండ్లలో ఐదు రెట్లు పెరిగిన సెస్, సర్‌చార్జీలు
- రాష్ట్రాల ఆదాయానికి అడ్డగోలుగా గండి
- షేరబుల్ ట్యాక్సుల్లో రాష్ట్రాల వాటా కుదింపు
- నిధుల పంపకాల్లోనూ దక్షిణాదికి అన్యాయం
- కేంద్రం వైఖరితో రాష్ట్రాలకు ఆర్థిక నష్టం: హరీశ్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ఎన్డీయే నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం రాష్ట్రాలను ఆర్థికంగా అస్థిరపరుస్తున్నది. న్యాయబద్ధంగా రాష్ట్రాలకు పంచాల్సిన పన్నుల (షేరబుల్ ట్యాక్స్‌లు) వాటాను క్రమంగా తగ్గిస్తూ.. నాన్-షేరబుల్ ట్యాక్సులుగా పిలిచే సెస్, సర్‌చార్జీలను అమాంతం పెంచేస్తున్నది. ఫలితంగా సామాన్యుల ముక్కుపిండి వసూలు చేస్తున్న రూ.లక్షల కోట్ల ట్యాక్సుల పైకాన్ని దొడ్డిదారిన కేంద్ర ఖజానాకు తరలించుకుపోతున్నది.

పదేండ్లలో ఐదు రెట్లు పెంపు

పేదలు, మధ్యతరగతి వర్గాల బతుకులను మారుస్తామంటూ ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన బీజేపీ సర్కారు.. గడిచిన పదేండ్లలో అదనపు పన్నుల పేరిట సామాన్యులపై భారీగా సెస్, సర్‌చార్జీలను విధించింది. 2013-14లో రూ.1.08 లక్షల కోట్లుగా (స్థూల పన్ను రాబడి (గ్రాస్ ట్యాక్స్ రెవెన్యూ-జీటీఆర్)లో 6.53 శాతం) ఉన్న సెస్, సర్‌చార్జీలు.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.5.56 లక్షల కోట్లకు చేరుకోవచ్చని (జీటీఆర్‌లో 10.97 శాతం) తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనాల ద్వారా వెల్లడైంది. అంటే గడిచిన పదేండ్లలో రాష్ట్రాలకు పంచని పన్నుల వాటాను కేంద్రం ఏకంగా 5 రెట్లు పెంచినట్టు గణాంకాలను బట్టి అర్థమవుతున్నది. ఇదే సమయంలో రాష్ట్రాలకు న్యాయంగా పంచాల్సిన పన్నుల వాటాను కేంద్రం అంతకంతకూ తగ్గిస్తున్నది. 2013-14లో జీటీఆర్‌లో రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పన్నుల వాటా 93.47 శాతంగా ఉంటే.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి దాన్ని 89.03 శాతానికి కుదించింది. ఈ మొత్తం పన్నుల్లో కేంద్రం కేవలం 41 శాతం నిధులను మాత్రమే రాష్ట్రాలకు విడుదల చేస్తున్నది. మిగతా 59 శాతం నిధులు కేంద్ర ఖజానాలో జమవుతాయి.

ఏమిటీ సెస్??

ప్రజలు వినియోగించే వస్తువులు, సేవలకు సాధారణంగా పన్నులను వసూలు చేస్తారు. అయితే ఈ అన్ని పన్నులకు అదనంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మరో పన్నును వసూలు చేస్తుంది. దీన్నే సెస్ అంటారు. దీన్ని పన్నుపై పన్ను అని కూడా అంటారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పెట్రోలియం, రహదారులు, మౌలిక సదుపాయాలు, ఎగుమతులు తదితర రంగాల్లో కేంద్రం సెస్ వసూలు చేస్తున్నది. సెస్సును ఏ రంగంలో వసూలు చేస్తే ఆ మొత్తాన్ని సదరు రంగం అభివృద్ధికే వెచ్చించాలి. ఇతర రంగాలకు బదిలీ చేయకూడదు. దీనికి భిన్నంగా కేంద్ర ప్రభుత్వం సెస్సుల రూపంలో వసూలు చేస్తున్న నిధులన్నింటినీ పక్కదారి పట్టిస్తున్నది. ఉదాహరణకు.. పెట్రోల్, డీజిల్‌పై విధించిన సెస్‌తో చమురు పరిశ్రమలను, ఆ రంగాన్ని అభివృద్ధి చేయాల్సి ఉండగా అదేమాత్రమూ జరుగట్లేదు. 2020-21 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో సెస్సుల రూపంలో వసూలు చేసిన రూ. 2.19 లక్షల కోట్లు సంబంధిత రంగాల అభివృద్ధి కోసం కేంద్రం ఏమాత్రం ఖర్చు చేయలేదని కాగ్ నివేదిక కూడా తూర్పారబట్టింది.

సెస్ పెంపు అందుకే..

కేంద్రం విధించే సెస్సుల్లో రాష్ట్రాలకు వాటా ఉండదు. ఆ సొమ్మంతా కేంద్ర ఖజానాకే చేరుతుంది. పన్నుల రూపంలో కేంద్రానికి వచ్చే రాబడిలోనే రాష్ట్రాలకు వాటా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రాలకు నిధులు ఎగ్గొట్టేందుకు కేంద్రప్రభుత్వం క్రమంగా సెస్సులను పెంచుతున్నది. ఇక, కేంద్రానికి వచ్చే రాబడిలో రాష్ట్రాలకు పంచాల్సిన వాటాను కూడా కేంద్రం క్రమంగా తగ్గిస్తున్నది. 2016-2021 మధ్య పన్నుల్లో రాష్ట్రాలకు ఇవ్వాల్సిన వాటా 42 శాతంగా ఉండగా.. 2022 నుంచి 2026 వరకూ దీన్ని 41 శాతానికి కుదించింది.

రాష్ట్రాలకు ఆర్థిక నష్టం

రాష్ట్రాలకు వాటా ఇవ్వనవసరం లేని సెస్, సర్‌చార్జీలను గడిచిన పదేండ్లలో కేంద్రం అమాంతం పెంచేసింది. స్థూల పన్ను రాబడి (జీటీఆర్)లో సెస్, సర్‌చార్జీల వాటా 6.53 శాతం నుంచి 10.97 శాతానికి పెరిగింది. ఈ ధోరణి రాష్ట్రాలకు తీరని ఆర్థిక నష్టాన్ని కలుగజేస్తున్నది.

- మాజీ మంత్రి హరీశ్‌రావు



కేంద్ర పన్ను రాబడుల్లో దక్షిణాదికి తగ్గుతున్న వాటా (శాతాల్లో)

రాష్ట్రం	2013-14	2017-18	2021-22	2025-26
తెలంగాణ, ఏపీ	6.94	6.75	6.15	6.1
కర్ణాటక	4.33	4.71	3.65	3.6
తమిళనాడు	4.97	4.02	4.08	4.1
కేరళ	2.34	2.5	1.93	1.9

కేంద్రం బాదుడు ఇలా..

- పన్నుల రూపంలో కేంద్రం వసూలు చేస్తున్న ప్రతీ రూ. 100లో సెస్, సర్‌చార్జీ వాటా – రూ. 11
- ట్యాక్స్ రూపంలో వసూలు చేసిన ప్రతీ 100 రూపాయల్లో కేంద్రం ఖర్చు చేస్తున్నది – రూ. 2

దక్షిణాదిపై వివక్ష

పన్ను రాబడిలో రాష్ట్రాలకు పంచే వాటాలోనూ ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం తీరని అన్యాయం చేస్తున్నది. 2013-14 నుంచి 2025-26 వరకూ చేసిన వాటాల పంపిణీ గణాంకాలను విశ్లేషిస్తే ఈ విషయం సులభంగా అర్థమవుతున్నది. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం.. ఆరు ప్రమాణాలను బట్టి రాష్ట్రాలకు కేంద్రం నిధులను పంపిణీ చేస్తున్నది. రాష్ట్రాల విస్తీర్ణం (15 శాతం), జనాభా (15 శాతం), అత్యల్ప తలసరి ఆదాయం (45 శాతం), అటవీ విస్తీర్ణం, పర్యావరణ పరిరక్షణ (10 శాతం), పన్ను వసూళ్లలో రాష్ట్రాల సామర్థ్యం (2.5 శాతం), జనాభా నియంత్రణలో రాష్ట్రాల పనితీరు (12.5 శాతం)ను బట్టి ఈ కేటాయింపులు చేస్తున్నారు. దీంతో జనాభా నియంత్రణను పాటించి, కేంద్రానికి అత్యధిక రాబడిని ఇస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు న్యాయంగా రావాల్సిన నిధులు అందకుండా పోతున్నాయి.

నిధుల్లేవ్.. పనుల్లేవ్

> మొదటిపేజీ తరువాయి...

డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తద్వారా రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభాన్ని వారికి వివరించారు. దీనిని సొంత పార్టీ ఎమ్మెల్యేలే విమర్శిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అసెంబ్లీలో శ్వేతపత్రం పెట్టారు... మొన్న టి సభలోనూ అప్పులు, ఆర్థిక వివరాలను వెల్లడించారు. అలాంటప్పుడు ఇప్పుడు మళ్లీ సీఎల్పీలో కూడా ఆర్థిక పరిస్థితి వివరించాల్సిన అవసరం ఏమిటనే సందేహాన్ని పార్టీ ఎమ్మెల్యేలు వ్యక్తంచేస్తున్నారు. భట్టి విక్రమార్క పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ వెనుక అంతరార్థం వేరే ఉన్నదనే ప్రచారం జరుగుతున్నది. పదేపదే పనులు, నిధులు అడుగుతున్న ఎమ్మెల్యేలకు ఝలక్ ఇవ్వడానికే ప్రజెంటేషన్ ఇచ్చారనే అభిప్రాయం పార్టీ నేతల్లో వ్యక్తమవుతున్నది.

నిధులు ఇవ్వండి ప్రభో..!

సీఎల్పీ సమావేశం సాక్షిగా 'మాకు నిధులు ఇవ్వండి మహాప్రభో..' అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ, ప్రభుత్వ పెద్దలకు మొరపెట్టుకున్నట్టు తెలిసింది. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తంచేసినట్టు సమాచారం. ఎమ్మెల్యేలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ, సహకారాలు అందడం లేదనే ఫిర్యాదులు చేసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం నుంచి ఒక్క పైసా రావడం లేదని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిసింది.

ఊర్లలోకి వెళ్లాలంటేనే భయపడుతున్నం

సీఎల్పీ సమావేశం సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు పార్టీ పెద్దలను కడిగిపారేసినట్టు తెలిసింది. 'మీకేంటి... ఇక్కడ కూర్చొని మస్తుగా చెప్తారు.. ఊర్లలో తిరిగే మాకు తెలుస్తుంది పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నదో' అంటూ ఒక ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలిసింది. నిధులు ఇవ్వకుండా పనులు ఏవిధంగా చేస్తామని ప్రశ్నించినట్టు సమాచారం. అసలు రాష్ట్రంలో ఏం జరుగుతున్నది? ఏడాది పూర్తయినా పాలన ఇంకా గాడిలో పడలేదని ఆగ్రహం వ్యక్తంచేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. పథకాలు అమలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పేరు రావడం లేదని, పథకాల్లో అడ్డగోలు కోతలు ప్రభుత్వాన్ని ముంచుతున్నాయని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. పథకాల్లో కోతలు బంద్ చేయాలని, గతంలో మాదిరిగానే అందరికీ ఇవ్వాలని, రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలని సూచించినట్టు తెలిసింది. మరికొందరు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నామని చెప్పినట్టు తెలిసింది. ముఖ్యంగా రుణమాఫీ, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకాల్లో కోతలు పెట్టడంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఊర్లలోకి వెళ్లాలంటేనే భయంగా ఉన్నదని చెప్పినట్టు తెలిసింది. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నష్టం తప్పదని పలువురు ఎమ్మెల్యేలు కరాఖండిగా చెప్పినట్టు సమాచారం.

సమ్మెకు ఆర్టీసీ రె'ఢీ'!

- సమాయత్తమవుతున్న కార్మికులు

హైదరాబాద్, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈవీ బస్సుల విధానంలో మార్పులు, సమస్యల పరిష్కారానికి జనవరి 27న ఆర్టీసీ యాజమాన్యానికి ఆర్టీసీ జాక్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోయాజమాన్యం, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో కార్మికులు సమ్మెకు రెడీ అవుతున్నారు. గురువారం సీబీఎస్ వద్ద ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్‌చైర్మన్ ఎం థామస్‌రెడ్డి మాట్లాడుతూ సమ్మె నోటీసుల నేపథ్యంలో యాజమాన్యంతో జాయింట్ మీటింగ్ ఏర్పాటుకు లేబర్ కమిషనర్ ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఎండీ కార్మికులను సమ్మెకు దూరం చేసే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం ఉన్నదని, డిమాండ్లను పరిష్కరించి కార్మికుల ముందుకు రావాలని పేర్కొన్నారు. బీ యాదయ్య, శ్రీనివాస్, జీ రాములు, భయ్యన్న, జీపీఆర్ రెడ్డి, ఆర్ఎన్ రెడ్డి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వెహికిల్స్‌తో పర్యావరణ పరిరక్షణ

- ఈవీల వాడకం పెంపునకు ప్రభుత్వ చర్యలు
- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా రవాణా వ్యవస్థలో మార్పులు తీసుకువస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. హైదరాబాద్ ఐటీసీ కాకతీయ హోటల్‌లో ఈటో మోటార్స్ నుంచి ఫ్లిక్స్ బస్, ఏసీ ఎలక్ట్రికల్ బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొన్నం రాష్ట్ర ఈవీ పాలసీ ప్రకారం 2026 డిసెంబర్ 31 వరకు రోడ్డు, రిజిస్ట్రేషన్ ట్యాక్సులకు మినహాయింపు ఇచ్చినట్టు తెలిపారు. ఈ విధానం వల్ల కాలుష్యం తగ్గించడం సాధ్యమవుతుందని వెల్లడించారు. కులగణనపై అనుమానాల నివృత్తికి బీసీ సంఘాలతో సమావేశానికి సిద్ధమని పొన్నం స్పష్టంచేశారు.

31వసారి ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

- ఏఐసీసీ కార్యదర్శి వేణుగోపాల్‌తో భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 31వసారి ఢిల్లీకి వెళ్లారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ తదితరులతో కలిసి గురువారం సాయంత్రం ప్రత్యేక విమానంలో పయనమయ్యారు. ఈక్రమంలో రాష్ట్ర ఎంపీలతో కలిసి ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలపై చర్చించనున్నట్టు సమాచారం. పదిమంది ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టు నోటీసులు ఇవ్వడం, పదిమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా సమావేశం కావడం వంటి పరిణామాలపై వివరించినట్టు తెలిసింది. అసమ్మతి ఎమ్మెల్యేలతో సమావేశం, బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ, స్థానిక సంస్థల ఎన్నికలు, పీసీసీ కూర్పుపై చర్చించినట్టు తెలిసింది. కాగా, బేగంపేట ఎయిర్‌పోర్టులో గురువారం జరిగిన విమాన ప్రమాదంతో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు అంతరాయం కలిగింది. ఓ ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ అదుపు తప్పడంతో రన్‌వే దెబ్బతిన్నది. దీంతో విమానాల రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. మరమ్మతుల అనంతరం రేవంత్ ఢిల్లీ పయనమైనట్టు తెలిసింది. ప్రమాదంలో ఎవరికి ఏమీ కాలేదు.

చేనేత సమస్యలు పరిష్కరించాలి

- ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన నేతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): చేనేత సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం నాయకుడు చెరుకు స్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. నేతన్న అభయహస్తం కింద పొదుపును ఆర్‌డీ 8 నుంచి 10 శాతానికి, ప్రభుత్వం చెల్లించే ఆర్‌డీ-2ను 16 నుంచి 20 శాతానికి మార్చాలని పేర్కొన్నారు. రుణమాఫీ నిధులు బ్యాంకులకు జమ చేయాలని తెలిపారు. నేతన్న భరోసా పథకం కింద వీవర్ రూ.2000, వర్కర్‌కు రూ.500 కూడా ఫిబ్రవరి నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇబ్బందులుంటే రాహుల్‌గాంధీకి చెప్పండి!

- మీడియాకు ఎక్కొద్దు.. సొంత ఎజెండాను సహించేది లేదు
- సర్పంచుల ఏకగ్రీవం బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదే
- పార్టీ ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్
- ఎమ్మెల్యేల అనుమానాలు నివృత్తి చేశాం: పీసీసీ చీఫ్
- పార్టీలో గొడవలు నిజమే: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సీఎల్పీ భేటీ అనంతరం మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ఏమైనా సమస్యలుంటే తనకు, లేదంటే పీసీసీ చీఫ్, రాష్ట్ర ఇన్‌చార్జి దృష్టికి తీసుకురావాలని పార్టీ ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఒకవేళ తమకు చెప్పడం ఇష్టం లేకుంటే రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇప్పిస్తానని, ఆయనకు చెప్పాలని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ మేరకు గురువారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో నిర్వహించిన సీఎల్పీ సమావేశంలో పలు అంశాలపై సీఎం రేవంత్ ఎమ్మెల్యేలకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సొంత ఎజెండాలను సహించేది లేదని హెచ్చరించినట్టు సమాచారం. సర్పంచ్ ఎన్నికలను ఏకగ్రీవం చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపైనే ఉన్నదని స్పష్టంచేసినట్టు తెలిసింది.

రెండ్రోజుల్లో పీసీసీ కార్యవర్గం : పీసీసీ చీఫ్

రెండు, మూడు రోజుల్లో పీసీసీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్టు, ఇందుకు సంబంధించి డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేల అభిప్రాయాలను సేకరించినట్టు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. సీఎల్పీ సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. కులగణన, ఎస్సీ వర్గీకరణపై తమ ఎమ్మెల్యే అనుమానాలను నివృత్తి చేసినట్టు చెప్పారు. సమావేశానికి ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎవరూ రాలేదన్నారు. ఎస్సీ వర్గీకరణపై మెదక్‌లో, కులగణనపై సూర్యాపేటలో భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నట్టు, మెదక్ సభకు ఖర్గేను, సూర్యాపేట సభకు రాహుల్ గాంధీని ఆహ్వానించనున్నట్టు వెల్లడించారు.

గొడవలు సహజం : మంత్రి కోమటిరెడ్డి

పార్టీలో గొడవలు సహజమేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎల్పీ సమావేశం అనంతరం మాట్లాడుతూ.. పార్టీ కుటుంబం లాంటిదని, చిన్న చిన్న గొడవలు పరిష్కరించుకుంటామని తెలిపారు.

అన్ని ప్రాజెక్టులకూ డీఎస్ఎస్

- ఇరిగేషన్‌శాఖ సమాలోచనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో అమలు చేస్తున్న డెసిషన్ సపోర్ట్ సిస్టమ్(డీఎస్ఎస్)ను గోదావరి, కృష్ణా బేసిన్‌లోని అన్ని ప్రధాన ప్రాజెక్టులకు విస్తరించేందుకు ఇరిగేషన్‌శాఖ కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే సేవలందిస్తున్న కన్సల్టెన్సీలతో తాజాగా ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. డీఎస్ఎస్ విస్తరణపై సమాలోచనలు చేశారు. వాతావరణ, ప్రాజెక్టులు, బరాజ్‌లు, నీటినిల్వలు, ఇన్‌ఫ్లోలు, ఔట్‌ఫ్లోలు, వరదలు తదితర సమాచారం మొత్తాన్ని పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా రియల్‌టైం డాటాను తెలుసుకునేలా డీఎస్ఎస్‌ను రూపొందించారు. తాజాగా దీనిని కాళేశ్వరం రాడార్‌లోని బరాజ్‌లు, పంపింగ్ స్టేషన్ల పర్యవేక్షణకు అమలుచేశారు. తాజాగా ఈ వ్యవస్థను అన్ని ప్రాజెక్టులకు విస్తరించాలని చేస్తున్న కసరత్తులో భాగంగా కన్సల్టెన్సీలతో ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు భేటీ అయ్యారు.

సీఎల్పీలో అనిరుధ్‌రెడ్డి హల్‌చల్

- ఫైళ్లు పట్టుకొని వచ్చిన జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే
- ఓ మంత్రి భూకబ్జా పత్రాలంటూ ప్రచారం
- ఎమ్మెల్యే అనిరుధ్‌తో దీపాదాస్ మున్షీ ప్రత్యేక భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): సీఎల్పీ భేటీలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హల్‌చల్ చేశారు. రహస్యంగా సమావేశమైన 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో అనిరుధ్‌రెడ్డి కూడా ఒకరు. సీఎల్పీ సమావేశానికి ఆయన కొన్ని పత్రాలు పట్టుకొనిరావడం హాట్‌టాపిక్‌గా మారింది. ఈ డాక్యుమెంట్లను ఆయన సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి అందిస్తూ.. రాష్ట్రంలో నంబర్-2గా పిలిపించుకుంటున్న ఒక మంత్రి మీద ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని వెలమల గ్రామం హామ్లెట్ తాండ కొండకల్ గిరిజనులకు చెందిన సీలింగ్ భూములను ఒక మంత్రి కబ్జా పెట్టినట్టు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఆ ఆధారాలనే అనిరుధ్‌రెడ్డి తన వెంట తెచ్చినట్టు సమాచారం. అలాగే అదే జిల్లా అమీన్‌పూర్ మండల కేంద్రంలో జరిగిన మరికొని కబ్జాల మీద కూడా ఆయన ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భూముల అన్యాక్రాంతంపై విచారణ చేయాలని కోరారు.

రహస్య భేటీపై మున్షీ సీరియస్!

పార్టీ ఎమ్మెల్యేల సీక్రెట్ మీటింగ్‌పై కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సీరియస్ అయినట్టు తెలిసింది. సమస్య ఉంటే నాలుగు గోడల మధ్య మాట్లాడుకోవాలని, కానీ ఎవరికి వారు రహస్య సమావేశాలు జరిపితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్టు తెలిసింది. బహిరంగ వేదికలపై మాట్లాడి ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించినట్టు తెలిసింది. బీసీ కులగణన సర్వే నివేదిక మీద తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే తీన్మార్ మల్లన్నకు షోకాజు నోటీసులు ఇచ్చినట్టు దీపాదాస్‌మున్షి తెలిపారు. షోకాజ్ నోటీసు అందుకున్న మల్లన్న సీఎల్పీ సమావేశానికి హాజరు కాలేదు.

సుప్రీంకోర్టు చూస్తున్నది.. పారిపో!!

- సీఎల్పీ భేటీకి 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల డుమ్మా
- సుప్రీంకోర్టుకు దొరికిపోతామని భయపడిన ఫిరాయింపుదారులు
- ఎంసీహెచ్‌ఆర్డీ వరకు వచ్చి చాటుగా వెనక్కి వెళ్లిన ఇద్దరు ఎమ్మెల్యేలు
- వారిని వెనుక గేటు నుంచి తప్పించిన కాంగ్రెస్ పార్టీ నేతలు
- న్యాయపరమైన చిక్కులున్నా పిలవటంపై ఆగ్రహం



సీఎల్పీ భేటీలో పాల్గొనేందుకు వచ్చి హడావుడి చేస్తున్న ఫిరాయింపు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, వెనుక గేటు నుంచి వెళ్లిపోతున్న కాలె యాదయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సీఎల్పీ సమావేశంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలు ఈ సమావేశానికి డుమ్మా కొట్టారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ భానుప్రసాద్ సీఎల్పీ సమావేశంలో పాల్గొనేందుకు ఎంసీహెచ్‌ఆర్డీ వరకు వచ్చారు. కానీ కాంగ్రెస్ నేతలు వారిని వెనుక గేటు నుంచి తప్పించారు. ఈ దృశ్యాలను 'నమస్తే తెలంగాణ' కెమెరామెన్ తన కెమెరాలో బంధించారు. సీఎల్పీ సమావేశానికి ఫిరాయింపు ఎమ్మెల్యేలను కూడా ఆహ్వానించామని, వారు కూడా హాజరవుతారని సీఎల్పీ ముఖ్యనాయకుడు ఒకరు ప్రకటించారు. దీంతో సోషల్ మీడియా, మెయిన్‌స్ట్రీమ్ మీడియా సిబ్బంది, కెమెరామన్లు అక్కడికి చేరుకున్నారు. కానీ అనూహ్యంగా చివరి నిమిషంలో వారు గైర్హాజరయ్యారు. ఫిరాయింపుల కేసు ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణలో ఉంది. ఈ నెల 10న తదుపరి విచారణ జరుగనుంది. మరోవైపు రెండు రోజుల కిందనే అసెంబ్లీ కార్యదర్శి ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీచేశారు. ఈ నేపథ్యంలో సీఎల్పీ సమావేశానికి హాజరైతే న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఫిరాయింపుదారులు వెనుకడుగు వేశారని చెప్పుకుంటున్నారు. ఈ మీటింగ్‌కు హాజరైతే బీఆర్ఎస్ పార్టీకి మరో చాన్స్ ఇచ్చినట్టు అవుతుందని, ఫిరాయింపునకు పాల్పడినట్టు సుప్రీంకోర్టుకు స్పష్టమైన ఆధారం ఇచ్చినట్టు అవుతుందనే కారణంతో 10 మంది ఫిరాయింపుదారులు మీటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. సీఎల్పీ భేటీకి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు జరిపారు.

నమ్మినందుకు అడ్డంగా ఇరికిస్తారా?

న్యాయపరమైన వివాదం ఏర్పడుతుందని తెలిసి కూడా తమను సీఎల్పీ భేటీకి ఆహ్వానించడంపై ఫిరాయింపు ఎమ్మెల్యేలు మండిపడుతున్నట్టు తెలిసింది. పార్టీ